# అద్దంలో ప్రతిబింబాలు

గాలిదేవుడు కోపమంతా మా కిటికీ రెక్కల మీదనే చూపిస్తున్నాడు. తిన్నగా వాటిని సముదాయించి అలా పడక కుర్చీలో కూచున్నాను. వంటింట్లోంచి పద్మ పాత్రలు కడిగే చప్పుడౌతోంది. ఈ రోజు థర్డ్ సాటర్ డే అవటంవల్ల ఈ సెలవుదినాన్ని ఎలా సార్థకం చేసుకుందామా అని ఆలోచిస్తున్నాను. 'పోస్ట్' అనే కేకతో ఆలోచనలకు ఫుల్ స్టాప్ పెట్టి వరండాలోకి వెళ్ళాను. 'బుక్ పోస్ట్'లో వచ్చిన ఓ పుస్తకం ఇచ్చి వెళ్ళాడు పోస్ట్‌మాన్. నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. ఈ మధ్య మొదటిసారిగా నే రాసిన కథ అచ్చయి పత్రిక కాపీ వచ్చింది. సంతోషం పట్టలేక "పద్మా! పద్మా!" అంటూ కేకేశాను. క్షణంలో 'ఏమిటి?' అంటూ పద్మ వచ్చి నిలబడింది.

"చూశావా? నా కథ పత్రికలో పడింది" అన్నాను.

"ఏదీ?" అంటూ పత్రిక తీసుకు చదవడం మొదలెట్టింది.

పద్మ చదువుతుంటే—ముఖంలో వచ్చే మార్పుల్ని గర్వంగా గమనిస్తూ—నా రచనాశక్తికి నేనే ఉప్పొంగిపోతున్నా. ఐదారు నిముషాల్లో కథపూర్తిచేసి చటుక్కున పత్రికవిసిరి టేబుల్ మీద పారేసింది కోపంగా. ఆశ్చర్యపోయాను. "ఓహో చాలా బాగుంది. ఎంత బాగరాశారూ," అని అంటుందని ఊహాగానం చేస్తున్న నాకు పద్మవైఖరి దెబ్బలాతగిలింది. అప్పటికి తమాయించుకుంటూ "ఎలా వుంది రచన?" అన్నాను. పద్మ కోపంగా అంది. "నా మొహంలా వుంది. నా కథే ఇలా పత్రికలో కెక్కిస్తారని నేననుకోలేదు."

నేను బిత్తరపోయాను. 'అదేమిటి పద్మా నీ కథేం రాశాను?' అన్నాను.

"కాకపోతే మరేమిటి? సంక్రాంతికి చీర తేనందుకు కోప్పడ్డానని కాదూ? అదే సంఘటనతో రాశారు కథ. నేనప్పుడే అనుకున్నా. మీరు కథ వ్రాయట మేమిటా అని."

నాకు నవ్వు, ఆశ్చర్యం ముంచుకొచ్చాయి తిన్నగా అన్నాను:

"చూడు పద్మా! అనవసరంగా నన్న పారం చేసుకోకు. నీ కథ కాదిది. లోకంలో ఇంకెవ్వరూ లేరా? సంఘటన కూడా నిజంగా నాకేనాటిది గుర్తు లేదు..."

నా మాట పూర్తికాకముందే పద్మ కోపంగా అన్నది: "రాతమూలకంగా చూపించి కాకుండా—మళ్ళీ అబద్ధాలెందుకు చెబుతారు?"..విసురుగా లోపలికి వెళ్ళిపోయింది.

ఇక ఆసమయంలో పద్మను ఒప్పించటం, నచ్చచెప్పడంలాంటివి వృథా ప్రయాస అనే విషయం నా అనుభవంలో బాగా తెలుసు. అందుకని అలా కాస్సేపు బయటికి వెళ్ళొద్దామని బయల్దేరాను.

కృష్ణా కేఫ్ దగ్గర తారసపడ్డాడు రమణ. ఉత్సాహంగా నా కథను గురించి చెబుదామనుకున్నా గానీ, పద్మ మాటలలో వుత్సాహం చప్పగా చల్లారిపోవడంవల్ల—ఆమాటలు పైకన లేకపోయాను. కాని వాడే మొదలెట్టాడు...

"ఏరోయ్ వేణూ! మంచికథ రాసి పారేశావే!"

"ఊఁ అన్నాను" లోపల్నే గర్వం అణుచుకుంటూ—

"ఊ మహా గొప్ప పోజు వెయ్యవాకోయ్! వెధవ పోజూ నువ్వూను... లేకుంటే స్నేహి

## పవని నిర్మల ప్రభావతి

తుడిననే ఆలోచనకూడా లేకపోయింది నీకు..." రమణ మొహంలో కోపం రగులుతుంటోంది. వాడి ధోరణి అర్థంగాక "ఏమిట్రా నువ్వంటున్నది" అన్నాను అమాయకంగా. ఇక చూచుకోండి... తారాజువ్వలా లేచాడు.

"ఇంకా మాట్లాడుతున్నావ్ మాబాగా. నా కథంతా వున్నదున్నట్టురాసింది గాక ఏమిటట ఏమిటి?...అసలు నిన్నని ఏం వుపయోగం. ప్రాణస్నేహితుడినని నేనమ్మకంతో నా స్వవిషయాలుగూడా నీకు చెప్పుకోటం నాది బుద్ధితక్కువ మొదట..."

నాకు తలతిరిగిపోయింది. 'ఇదేం ఖర్మరా బాబూ' అనుకుంటూ మెల్లగా "చూడు రమణా! నువ్వూరికే ఆట్టే వాగకు...కాస్త నే చెప్పేది వినిపించుకుంటావా?"

"ఊహూ ఇంకా ఏం వినాలి? నీ బుకాయింపులా?" రమణ మొహంలో కోపం ఇంకా అల్లాగే వుంది.

"బుకాయింపులు గాదురా బాబూ! పచ్చి నిజాలు! నీ కథ రాశావని నువ్వపోహ పడుతున్నావ్! తన కథ రాశానని మా పద్మ అనుమానపడుతోంది...మరి మీ ఇద్దర్లో ఎవరికథ ఇది?" అన్నాను.

వాడాశ్చర్యంగా అన్నాడు: "మీ ఆవిడా? అసలావిడ కథే లేందే?"

"మరి నీ కథ మాత్రం వుందేమిటి? పద్మకు" స్నేహితుని కథ ఇది "అని చెబితే—నీలాగే అంటుంది అవునా?"

వాడికి నోటమాట రాలేదు. గుడ్లప్పగించి చూస్తున్నాడు నా వేపు.

"నిజానికి నే రాసేటప్పుడు మీ రెవ్వరూ నా స్మృతి పథంలోకి రాలేదు...నా ఊహ అంతా! కథ అచ్చయిందే గానీ—నే పొందాల్సిన ఆనందం మాత్రం కాస కూడా నాకు లభ్యం కాలేదు" బాధగా నిట్టూర్చాను.

రమణ భలే ఫీలయ్యాడు.

"సారీ వేణూ! కుమ్మడి కాయల దొంగలా అయింది నా పని...ప్లీజ్ యక్స్‌క్యూజ్ మీ? తమాషా కాదు...చాలా బాగా రాశావ్! మరే మనుకోకురా బ్రదర్. నా కప్పుడప్పుడు బుర్రమహా చవటగా పనిచేస్తుంటుందని నీకూ తెలుసు గదుట్రా తండ్రీ!" వాడి ధోరణితో నేను మళ్ళీ మామూలు మనిషినయాను.

హుషారుగా భుజం తడుతూ అన్నాడు రమణ "సినిమా మాటినీకి వెళ్దాం పద."

"ఇప్పుడా? పద్మతో చెప్పి రాలేదురా!"

"ఫర్వాలేదు లేవోయ్... నేమాత్రం చెప్పొచ్చా నేమిటి మా గిరిజతో? ఊహించుకోలేరూ ఆ మాత్రం? పదవోయ్! మహా అన్నిటికీ తెగని ఆలోచనేమిటి?"

నెట్టుకుపోయాడు నన్ను.

పిక్చర్ ప్రారంభమైనా నాకింకా పద్మ మీదనే వుంది ఆలోచన...కోపం ఇంకా తగ్గివుండదు...దానికితోడు చెప్పకుండా ఇలా పిక్చర్ కెళ్ళిపోవడంతో అగ్నిలో ఆజ్యం పోసినట్టయివుంటుంది ఈ రమణకేం. తెలుసు నా బాధ. చెబితే ఎగతాళి చేస్తాడు. బాగా రష్‌గా వుంది హాలు. నా పక్కనుండే



కుర్చీలో ఎవరో కూచోటం చూచి ఇటు తిరిగాను. ఆయన్ని చూడగానే ఎందుకనో నా జ్ఞానేంద్రియాలు పని చెయ్యటం మానేశాయ్. అపరయముడు మా ఆఫీస్ మేనేజర్!" ఏదో సరదాగా (మనస్సులో దసుక్కా) థియేటర్ కువస్తే ఇక్కడ ఈయన ప్రత్యక్షమయ్యాడు. ఇక సినిమా మీదికేం పోతుంది మనస్సు. పక్కన్న కూచున్న రమణ పిక్చర్లో ఏ సంభాషణకో సంతోషం పటలేక నన్ను ఒక్క చరుపు చరిచి పెద్దగా నవ్వుతూ నా మొహం వేపు చూశాడు "ఏమిట్రోయ్! ఇక్కడ బుద్ధుడిలా కూచున్నావే!" పైగా మరో ఎగతాళి ముక్క కూడా విసిరాడు.

బిక్క చచ్చిపోతూ నాణిగిలుతూ అన్నాను "మేనేజర్ గారురా పక్కన!"

మరొకప్పుడైతే "ఏమిట్రా నీగోల!" అంటూ పెద్దగా అనేసేవాడే కానీ— అదృష్టంకొద్ది అక్షణంలో వాడి సర్వేంద్రియాలు కర్ణేంద్రియం సూక్ష్మంగా పని చెయ్యటంవల్ల నామాటకర్థం గ్రహించి చప్పున నోరు నొక్కుకున్నాడు.

స్వేచ్ఛగా మాట్లాడుకోటాని క్కూడా లేకుండా ఏమిటా ఈఖర్మని ఆయన్ని తిట్టుకుంటూ—అసలే ఆ హిందీ అర్థమైచావక పోవడంతో మరింతచికాకుగా చూస్తున్నాను పిక్చరును. ఉన్నట్టుండి మేనేజర్ గారు నన్ను తట్టారు..."చచ్చిరి పోదగుల్!" అనుకుని ఇక్కడకూడా ఏ ఫైలు సరిగ్గా రాయలేదనో చివాట్లు పెడతాడేమో అనుకుంటూనే "ఏమిటిసార్?" అన్నాను మెల్లగా పెదవులమీది వినయంతో.

"ఏం లేదు...ఈరోజు 'వేణు' అనే పేరుతో పత్రికలో ఓ కథ వచ్చిందే... అది......"

పొంగివచ్చే సంతోషాన్నాపుకుంటూ కొద్దిగా సిగ్గుపడుతూ అన్నాను..."అది నే వ్రాసింగ నండీ!"

"ఓహో అదే అనుకున్నాను! ఎప్పుడు నేర్చుకున్నావోయ్ కథలు వ్రాయటం?" అన్నారాయన చిరునవ్వుతో!

అబ్బ...ఇప్పటికైనా...ఒక్కరైనా నా కథను మెచ్చుకున్నారనే సంతృప్తి నిండిపోయింది నాలో...మెలగా "ఇదే మొదటి కథ సార్...ఏదో వుబుసుపోక..."

ఉత్సాహంగా చెబుతున్న నామాటలకు మధ్యలోనే అడ్డుపడి అందుకున్నాడాయన "మేనేజర్ గారి కథైతే బాగుంటుందనుకున్నావ్? అంతేగా? అసలు మీమ్మల్ని పొపండలవటంమహాపాపమోయ్! ఎప్పుడైనా లేట్ గా వచ్చినా—నేనంతగా పట్టించుకోనుగదా విశ్వాసఘాతకులు...ఆఫీస్ వగ్గు మొదలుకొని నేననే మాటలతో సహా కథట కథ...ఇది ఓ రచనేనా?"

నాకళ్లు తిరిగిపోయినై. నాకింకేమీ వినిపించలేదు. ఆయనకు నచ్చజెప్పటానికి తాతలు దిగిరావాలనే సత్యం తెలుసు కాబట్టి వూరుకున్నాను వింటూ "ఇంకెప్పుడూ ఇలాంటి అవకతవక పనులు - అంటే కథలు రాయకు" అంటూ ఆయన తనదండకం ఆపాడు.

కనీసం లేచిపోదామంటే ఇంటర్వెల్ అయినా లేదీ వూళో. చచ్చినట్టు పిక్చరయ్యేంత వరకు కూచుని నల్లులబాధతో సహా ఈ ఆశీర్వచనాలు కూడా జతచేసుకు బయటపడ్డాను. రమణ మాత్రం...పిక్చర్లోని ఏవేవో సంగతులు చెబుతున్నాడు.

ఇంటికి పోవటానికిష్టంలేక నేరుగా హోటల్ కువెళ్లి భోంచేసి అలా భామమూర్తి ఇంటికి వెళ్ళాను ఎల్లాగో వాడు మాత్రం అనలేదు నా కథేనని. సాయంత్రం దాకా అక్కడేవుండి ఇంటికి వచ్చాను. ఇంకా ఏం తుఫాను ఎదుర్కోవాలో అనుకుంటూ!

తలుపు తీస్తూ చిరునవ్వుతో ఎదురైన పద్మను చూచి ఆశ్చర్యపోయాను. "మధ్యాహ్నం భోజనానికి రలేదేం?"

"పనితావో పెట్టవోనని!" అన్నాను నవ్వుతూ.

"పోన్లెండి......బాగా ఓ సుప్పావలా వదిలుంటుంది. మరెప్పుడూ ఇలా చెయ్యకు కదూ...సరేగానీ...మన పక్కింటి సావిత్రి లేదూ? మధ్యాహ్నం వచ్చి ఏమందో తెలుసా?"

"ఏమందేమిటి?" అన్నాను సస్పెన్స భరించలేక.

"మీకథ తనను గురించిట" పద్మ విరగబడి నవ్వింది.

"ఓహో...నీగురించి కాదా?" నేనూ పెద్దగా నవ్వుతూ అన్నాను.

"చాల్లెండి. కాస్త రెడీ అయితే 'అపరాధి కానేకా?' పిక్చరుకెళదాం. నే రెడీ అయ్యాను" పద్మ అంది మృదువుగా.

"నే చూశానమ్మాయ్!"

"తెలుసు.....సావిత్రి వాళ్ళింటాయన కూడా వచ్చాడట లెండిమ్యాట్నీకి. అయినా నేచూళ్ళేదుగా?" తల దువ్వుకు డ్రస్సు మార్చుకుంటారా? టైం కావొస్తోంది."

"మరి తప్పుతుందా?" అంటూ అద్దం ముందుకు వెళ్ళాను. అద్దంలో ప్రతిబింబం నవ్వింది. చటుక్కున ఏదో స్ఫురించింది.

"పద్మ... ఇలారా! ఇలారా!"

"ఏమిటి?" ఆదుర్దాగా వచ్చింది పద్మ.

"అదో అద్దంలో చూడు"

ఆశ్చర్యంగా అద్దంలోకి చూస్తూ అంది పద్మ" "ఏ ముందిక్కడ అద్దంలో నా ప్రతిబింబం తప్పిస్తే!"

"అదేమరి! దాన్ని చూచి కోప్పడలేదేం నువ్వు?"

"ఎందుకు?"

"ఎందుకేమిటి? మరి నాకథచూచి నువ్వు నవ్వేమిటి రమణ, మా మేనేజర్...అదో ఇందాకన్నావే సావిత్రీ......ఇంత మంది కోప్పడితే!......" నామాట మధ్యలోనే ఆపింది పద్మ.

"ఓహో అదా? అయితే మేము మీకథలో మా ప్రతిబింబాల్ని చూచి ఆపోహపడ్డామంటారు...అంటే మీ కథ..."

"కేవలం ఓ అద్దంమాత్రమే!" హాయిగా సంతృప్తిగా అన్న నా మాటలు వింటూ,

మెల్లగా అంది పద్మ "సరే.....ఊహాలోకంలోంచి వాస్తవ జగతులోకి రాగలిగితే టైం అయికావొస్తోంది...!" మళ్ళీహాయిగా నవ్వుతూ నా ప్రతిబింబాన్ని చూచుకున్నాను అద్దంలో. ★


మెక్లీన్స్ రంగులువేసే పోటీ

ఇప్పుడే పాల్గొనండి!

వందల కొలదీ బహుమతులు గెలువబడవలెను!